సాక్షి వరంగల్

గురువారం | 25 | జూలై | 2024



నిలకడగా ఉభయ నదులు..

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ఉభయ నదులు ప్రాణహిత, గోదావరిలో వరద నిలకడగా కొనసాగుతోంది. - 8లో▸



ఆశలు.. అడియాసలేనా!

విద్యుత్ సంస్థలో బదిలీలు లేకపోవడంతో తమ ఆశలు అడియాసలు అవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

నేడు కమిషనర్‌తో ఫోన్ ఇన్



వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్య పనులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సందేహాలను నివృత్తి చేయడానికి గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు ఫోన్ చేసి సూచనలు, సలహాలు, సమస్యలను వివరించాలని మున్సిపల్ కమిషనర్ ఈ జోనా సూచించారు.

తేది : 25-07-2024, గురువారం
ఫోన్ చేయాల్సిన నంబర్ :
99895 83055
సమయం : ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు

న్యూస్‌రీల్

జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి



నర్సంపేట: రోడ్డు పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని నర్సంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి సూచించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో ఆధ్వర్యంలో డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అధ్యక్షతన బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి డ్రైవర్ల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐకి డిపో మేనేజర్ మొక్క అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ డీఎస్.నారాయణ, హెడ్‌గార్డ్ వీరారెడ్డి, డిపో సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



పర్వతగిరి: చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి బాసాని మనోజ్ కుమారుడు విహాన్ బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. విహాన్ తల, ముక్కు భాగంలో కుక్కలు కొరికాయి. తల్లిదండ్రులు గమనించి తరమడంతో కుక్కలు పారిపోయాయి. వెంటనే, విహాన్‌కు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి మనోజ్ మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కలను అధికారులు నియంత్రించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు వాహనాల వేలం

నర్సంపేట రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఏఈఎస్ మురళీధర్ సమక్షంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్‌కు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

108 సిబ్బందికి 'లైఫ్ సేవియర్ అవార్డులు'



హన్మకొండ అర్బన్: వరంగల్ జిల్లాకు చెందిన మెడికల్ టెక్నీషియన్ కర్ణాకర్, 108 పైలట్ కోటేశ్ 'లైఫ్ సేవియర్' అవార్డు అందుకున్నారు. 108 అత్యవసర అంబులెన్స్ సేవలందించడంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వీరికి బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఎంఎ ఖాలీద్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, జిల్లా మేనేజర్ రాజ్‌కుమార్, లక్ష్మణ్, చంద్రశేఖర్, నరేశ్ పాల్గొన్నారు.

దిగుబడిలో మేటి.. ఆయిల్‌పామ్

ఎకరాకు 10 టన్నుల గెలలు
- రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- రాయితీపై డ్రిప్ పరికరాల పంపిణీ
- నాలుగు సంవత్సరాలు ఎరువులకు డబ్బుల అందజేత
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- జిల్లాలో ఈ సంవత్సరం 3,600 ఎకరాల్లో సాగు అంచనా



ఖిలావరంగల్ మండలం మామునూరులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్



కాశిబుగ్గ: కాజీ సెంటర్: పెరుగుతున్న జనాభాకు సరిపడా మార్కెట్‌లో ఆయిల్‌పామ్ ఉత్పత్తులు అందుబాటులో లేవు. ఈ క్రమంలో ఆయిల్‌పామ్ పంటల సాగును పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం రైతులకు పలు సబ్సిడీలు అందించి ప్రోత్సహించేందుకు సన్నాహాలు చేస్తోంది. గతంలో జిల్లాలో ఆయిల్‌పామ్ పంటలు సాగుచేసేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. రాయితీలు ప్రకటించడంతో ప్రస్తుతం జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు ముందుకు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఈసంవత్సరం 3,600 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

అన్ని నేలలు అనుకూలమే..

గుర్తించిన ప్రాంతాల్లోనే ఈ పంటలను సాగు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పంట సాగు, గెలల కొనుగోళ్లను ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన ఫ్యాక్టరీ వారు ఉద్యానశాఖ సహకారంతో నిర్వహిస్తారు. పంట కొనుగోలు ధరను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉద్యానశాఖ కమిటీ నిర్ణయిస్తుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ధరలు మారుతాయి. సంబంధిత కంపెనీ ద్వారా ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పకుండా రైతుల ఖాతాల్లో పంటకు సంబంధించిన డబ్బులు జమచేస్తారు. నీరు నిల్వ ఉండే నల్లరేగడి (బంక నేలలు), చౌడు భూములు తప్ప అన్ని రకాల నేలల్లో పండించవచ్చు. నీటి పారుదల సౌకర్యం ఉండి, గాలిలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలు ఈ పంటకు అనుకూలంగా ఉంటాయి.

లాభాలు ఇలా..

పంట వేసిన నాలుగు సంవత్సరాల నుంచి దుక్కి దున్నరాదు.7 సంవత్సరాల నుంచి కోకో సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా అదనంగా ఎకరాకు రూ.30 వేల నుంచి 40 వేల వరకు అధిక ఆదాయం పొందవచ్చు. సేంద్రియ ఎరువులతో పండిస్తే ఎకరాకు సుమారు 10 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం గెలల టన్ను రూ.13,705 ఉంది. ఒక ఏడాదిలో లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.దీనికి ఎకరాకు రూ.30 వేల లోపు ఖర్చు మాత్రమే అవుతుంది. నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు ఉంటుంది.గెలల దిగుబడి జూన్, జూలై నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది. నూనె దిగుబడి కూడా 17 శాతం నుంచి 20 శాతం ఉంటంది.

రాయితీలు..

మొక్కలపై 90 శాతం సబ్సిడీ, ఒక హెక్టారుకు సంవత్సరానికి రూ.10,500 చొప్పున నాలుగు సంవత్సరాలు ఎరువులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాకుండా బిందు సేద్యం పరికరాలపై పెద్ద రైతులకు 80 శాతం, సాధారణ రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ లభిస్తుంది. అదేవిధంగా పంట కోత పరికరాలు, గెలల రవాణాకు కూడా సబ్సిడీ ఉంది. తుపాన్లు, వరదలు, పశువులు, పక్షులతో ఆయిల్ పామ్ పంటకు ఎలాంటి నష్టం వాటిల్లదు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు..



ఆయిల్‌పామ్ పంట సాగు కోసం ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుకు లాభసాటి పంట ఆయిల్‌పామ్. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు రాయితీలు వర్తిస్తాయి. రైతులు స్థానిక మండల ఉద్యాన శాఖాధికారులను సంప్రదిస్తే పూర్తి వివరాలు లభిస్తాయి. మరింత సమాచారం కోసం 8977714060 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఎస్.తిరుపతి, వరంగల్ డివిజన్ ఉద్యాన శాఖాధికారి

ఎకో టూరిజంగా పాకాల అభివృద్ధి

ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



వరంగల్ : పాకాల సరస్సు అభివృద్ధి సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

వరంగల్: ఎకో టూరిజంగా పాకాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అటవీ శాఖ అధికారి అనుజ్‌అగర్వాల్‌తో కలిసి బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాకాల సరస్సును ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో డీసీపీ రవీందర్, జిల్లా టూరిజం అధికారి శివాజీ, హెరిటేజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో ప్రథమ స్థానంలో నిలపాలి

వనమహోత్సవంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్, అధికారులతో కలిసి వనమహోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25.58 లక్షల మొక్కలు నాటే లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 16.17 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని జూలై చివరి నాటికి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో శ్రీగంధం, కొబ్బరి తదితర మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ రావుకు సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన వారిలో ఉత్తములను ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రజలు మొక్కలు నాటి సెల్ఫీ తీసి అప్‌లోడ్ చేయాలని కోరారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, డీఈఓ వాసంతి, ఫారెస్ట్ సూపరింటెండెంట్ సదానందం, మెప్మా పీడీ రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్ మనాక్'పై అవగాహన కల్పించాలి

కాజీ సెంటర్: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల నామినేషన్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ఇన్నోవేట్ ఐడియాలు ప్రదర్శనలు వచ్చే విధంగా కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి కోరారు. 2024–25 ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పోస్టర్‌ను కలెక్టరేట్‌లో డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, అధికారులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఇన్నోవేట్ ఐడియాల ప్రదర్శనలకు ప్రభుత్వమే రూ.10 వేలు ఇస్తుందని తెలిపారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రంలో ప్రతిసారీ అత్యధికంగా నామినేషన్లు సమర్పించి విద్యార్థులు జాతీయస్థాయిలో నిలిచారని తెలిపారు. డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి జి.హైమావతి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

కాశిబుగ్గ: వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సత్య శారదాదేవి సూచించారు. గ్రేటర్ 35వ డివిజన్ చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, వైద్యులు దిలీప్, ఫార్మసిస్ట్ జ్యోత్స్న, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి



నాచినపల్లి పీఏసీఎస్ గోడౌన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న డీసీఓ సంజీవరెడ్డి

దుగ్గొండి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని నాచినపల్లి, మహ్మదాపురం, దుగ్గొండి, మందపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, రికార్డులు, రుణమాఫీ రైతుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. మందపల్లి, దుగ్గొండి సంఘాల పరిధిలో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని, వారికి త్వరలోనే మాఫీ అందుతుందని తెలిపారు. సహకార సంఘాల్లో నిరంతరం యూరియా అందుబాటులో ఉంటుందని, రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్లు సుకినె రాజేశ్వర్‌రావు, భట్టు పైడి, ఊరటి మహిపాల్‌రెడ్డి, గుడిపల్లి శ్రీనివాసరెడ్డి, సీఈఓలు ఓంకార్, రమేశ్, భిక్షపతి, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్

ఖానాపురం: పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ ఉషాదయాళ్ సూచించారు. చిలుకమ్మ తండా, అశోక్‌నగర్ గ్రామాల్లోని పత్తి, మొక్కజొన్న పంటలను బుధవారం ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలాల నుంచి నీటిని తీసివేయాలన్నారు. ఇప్పటివరకు నార్లు పోసుకోని రైతులు వర్షాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొలాలను దమ్ము చేసి వడ్లను నేరుగా విత్తుకోవాలన్నారు. పత్తిలో వడతెగులు నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల మొదళ్ల చుట్టూ పోయాలన్నారు. వర్షాలతో మొక్కజొన్న పసుపు రంగుకు మారకుండా నీటిని బయటకు తీసివేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ కన్సల్టెంట్ సారంగం, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల ప్రణాళిక


హన్మకొండ: వరంగల్ జిల్లాలో ఉద్యాన పంటల సాగు ప్రణాళిక ఖరారు అయింది. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సమీకృత అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ యాజ్ ఎడిబుల్ ఆయిల్స్, జాతీయ వెదురు మిషన్ పథకాల ద్వారా అమలు చేసే లక్ష్యాన్ని ఉద్యాన శాఖ ఖరారు చేసింది. అరటి, బొప్పాయి పంటలకు రెండు సంవత్సరాలపాటు, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో పంటలకు మూడు సంవత్సరాలపాటు రాయితీ అందిస్తారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో రూ.298.48 లక్షలతో 680 ఎకరాల్లో సూక్ష్మ సేద్యం, రూ.6.55 లక్షలతో 86 ఎకరాల్లో అమలు చేయనున్నారు. 14 యూనిట్ల శాశ్వత పందిళ్లకు రూ.7 లక్షల రాయితీ అందిస్తారు. 50 శాతం రాయితీ కింద రూ.50 వేలు యూనిట్‌కు రాయితీ చెల్లిస్తారు. నేషనల్ మిషన్ యాజ్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం ద్వారా జిల్లాలో 3,600 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు పెంచుతారు. ఒక మొక్కకు రూ.193, నాలుగు సంవత్సరాల పాటు తోటల సంరక్షణకు ఎకరాలకు రూ.2100 చొప్పున, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలకు నాలుగు సంవత్సరాల పాటు ఎకరానికి రూ.2,100 చొప్పున రాయితీ రైతులకు చెల్లిస్తారు. జాతీయ వెదురు మిషన్ ద్వారా జిల్లాలో వెదురు తోటల పెంపకానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ (ఎకరాకు రూ.వేలు) అందిస్తుంది. జిల్లాలో 38 ఎకరాల్లో వెదురు తోటలు పెంచాలని, పొలం సరిహద్దులపై 5,313 మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. పొలం సరిహద్దులపై పెంచేందుకు ఒక్కో మొక్కకు రూ.60 రాయితీ చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన అధికారులు ఎస్.తిరుపతి (8977714060) పి.కమలాకర్ రెడ్డి (8977714061), వి.అశోక్ (8977714062), బి.తరుణ్ (8977714063) సంప్రదించాలని జిల్లా ఉద్యాన అధికారి ఆర్.శ్రీనివాస్‌రావు తెలిపారు.

మత్స్యశాఖ జిల్లా అధికారిగా నాగమణి

గీసుకొండ: మత్స్యశాఖ జిల్లా అధికారిగా ఎ.నాగమణి నియమితులయ్యారు. మహబూబాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి రెండు రోజుల క్రితం బదిలీపై వచ్చారు. వరంగల్‌లో పనిచేసిన నరేశ్‌కుమార్‌నాయుడు పెద్దపల్లి మత్స్యశాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. అలాగే, జనగామ జిల్లా అధికారి నాగులు కరీంనగర్ లోయర్‌మానేరు డ్యాం (ఎల్ఎండీ) అధికారిగా బదిలీ కాగా ఆయన స్థానంలో నారాయణపేట నుంచి రాణాప్రతాప్ వచ్చారు.

ధరణి సమస్యలకు మోక్షం

నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ మండలానికి చెందిన చల్లా కృష్ణారెడ్డికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వారికి 410, 411, 402, 412 సర్వే నంబర్లలో వ్యవసాయ భూమి ఉంది. కృష్ణారెడ్డికి చెందిన ముగ్గురు కుమారులు పట్టా పాస్‌బుక్‌లు కావాలని 2018 మే 10వ తేదీన రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. నాటి నుంచి నేటి వరకు సాంకేతిక సమస్యలతో పట్టాపాస్ బుక్‌లు అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించింది. ఈ ప్రక్రియలో భాగంగా వారు పట్టా పాస్‌బుక్‌లకు తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 6 సంవత్సరాల తర్వాత రెవెన్యూ అధికారులు వారి సమస్యకు పరిష్కారం చూపనున్నారు.



పట్టా పాస్‌బుక్‌ల కోసం అధికారులకు రాసిన వినతిపత్రం

- ఆగస్టు 15 లోపు పరిష్కారానికి అధికారుల కసరత్తు
- జిల్లాలో 2,700 సమస్యలు గుర్తింపు

నర్సంపేట: ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా రైతులు ఎదురు చూస్తున్నారు. రెవెన్యూ అధికారుల ప్రత్యేక ప్రణాళికతో సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కసరత్తు సఫలీకృతం కానుంది. గతంలో కలెక్టర్‌కు మాత్రమే ధరణిలో సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ప్రస్తుతం మండలాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి తహసీల్దార్లు నాలుగు రకాల మాడ్యుల్స్‌కు సంబంధించిన దరఖాస్తులు పరిష్కరిస్తున్నారు. గత నెల 25 వరకు 2700 సమస్యలను అధికారులు గుర్తించారు. తహసీల్దార్ల పరిధిలో 1800 సమస్యల్లో 90 శాతం పరిష్కరించారు. ఆర్డీఓ, కలెక్టర్ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు 50 శాతం వరకు కొలిక్కి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అదే విధంగా టీఎం–7 పాస్ పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదైనవి, భూసేకరణకు సంబంధించిన సమస్యలు, కోర్టు కేసులకు సంబంధించిన తదితర భూ సమస్యలు ఆర్డీఓలు పరిశీలించి ఆగస్టు 15లోగా పరిష్కరించనున్నారు.

ఆగస్టు 15లోపు పరిష్కరిస్తాం..



ధరణి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం. ఆగస్టు 15 వరకు పూర్తిస్థాయిలో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తాం. నిషేధిత భూములు, పాస్ పుస్తకాల్లో సవరణలు, మ్యూటేషన్లు, వారసత్వ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. దీని కోసం నిరంతరం సంబంధిత అధికారులతో సమీక్షలు చేస్తున్నాం.

– సంధ్యారాణి, జిల్లా అదనపు కలెక్టర్

కమిషనరేట్‌లో పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 13 మంది ఏఎస్సైలు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను కౌన్సెలింగ్ పద్ధతిలో వారు ఎంపిక చేసుకున్న పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవాదుల నిరసన



మాట్లాడుతున్న న్యాయవాది అంబటి శ్రీనివాస్

నర్సంపేట రూరల్: ఓ కేసు విషయంలో నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నర్సంపేట కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిరీషకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు జడ్జి శ్రీదేవి, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నల్లబెల్లి ఎస్సై ప్రశాంత్‌బాబు, న్యాయవాది బొట్ల పవన్ ఇరువురు స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించాలని సూచిస్తూ కరచాలనం చేయించారు. సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. న్యాయవాదులు తండా సారంగపాణి, తొగరు నర్సింహారెడ్డి, మోటూరి రవి, రంగనాథస్వామి, కొడిదెల సంజయ్, కొమ్ము రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



సబ్‌స్టేషన్‌లో పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ

నెక్కొండ: మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ మధుసూదన్ అన్నారు. రెడ్లవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రెడ్లవాడ, నెక్కొండ, పత్తిపాక, నాగారం, అలంకానిపేట సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. వీటి ఏర్పాటుతో సబ్‌స్టేషన్లలో ఓవర్‌లోడ్ కాకుండా నియంత్రించవచ్చన్నారు. 11 కేవీ లైన్లలో 600 కేవీఆర్ కెపాసిటర్లు అమర్చడంతో మోటార్లు కాలిపోకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట ట్రాన్స్‌కో డీఈ శ్రీధర్, ఏఈ చిరంజీవి, లైన్‌ఇన్‌స్పెక్టర్ భద్రయ్య, జూనియర్ లైన్‌మన్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.



బుజ్జి సందడి

కల్కి సినిమాలో హీరో ప్రభాస్ ఉపయోగించిన 'బుజ్జి' కారు వరంగల్ నగరంలో సందడి చేసింది. ఇటీవల విడుదలైన కల్కి సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ నిమిత్తం హనుమకొండలోని ఏషియన్ మాల్‌లో 'బుజ్జి'కారును బుధవారం ప్రదర్శనకు ఉంచారు. దీనిని చూసేందుకు యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. బుజ్జితో సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసుకుని సంబురపడ్డారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

క్లుప్తంగా

నవలలకు ఆహ్వానం

హన్మకొండ కల్చరల్ : ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం -2024 సంవత్సరానికిగాను నవలలను ఆహ్వానిస్తున్నామని అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షులు నిధి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పల్లేరు వీరస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ నవలను ఎంపిక చేసి అక్టోబర్‌లో హనుమకొండలో నిర్వహించే కార్యక్రమంలో రూ. 5వేల నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. 2020 జూలై నుంచి 2024 జూన్ వరకు ప్రచురితమైన మొదటి ముద్రణలు మాత్రమే పంపాలని, అన్ని ప్రాంతాల వారు పంపొచ్చని, వచ్చే నెల 31వ తేదీ లోగా ప్రతులు పంపాలన్నారు. ఇతర వివరాలకు 9701000306 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సిబ్బంది

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డికి చెందిన సాయిరాం బిన్ని రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 9లక్షల 10 వేల విలువైన 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై గూడ అరుణ్ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామని, వారు శాంపిల్స్ తీసుకున్నారన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చే నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

దంతాలపల్లి: బైక్‌ను ఢీకొని ఒకరి మృతికి కారణమైన సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెంకన్నకు తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత రెండేళ్ల జైలుశిక్ష , రూ. 2వేల జరిమానా విధించినట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. 2015లో మండలంలోని రామానుజపూరం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పని నిమిత్తం బైక్‌పై మండలకేంద్రానికి వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గల పాలేరు వాగు వద్ద సూర్యాపేట వైపు నుంచి దంతాలపల్లికి వస్తున్న బస్సు..బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటపై మృతుడి సోదరుడు మహిపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి ఉమ్మడి నర్సింహులపేట ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు. వాదప్రతివాదనల అనంతరం నేరం రుజువు కావడంతో తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత.. బస్సు డ్రైవర్ వెంకన్నకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారు. కాగా, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ గణేశ్ ఆనంద్, కోర్టు కానిస్టేబల్ రాజారాంను ఉన్నతాధికారులు అభినందించారు.



ఆశలు.. అడియాసలేనా!

- విద్యుత్ సంస్థల్లో ఇంకా మొదలుకాని బదిలీలు
- షెడ్యూల్ విడుదల కోసం ఉద్యోగుల ఎదురుచూపు
- స్పష్టత ఇవ్వని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా జాప్యానికి కారణమని ఉద్యోగ వర్గాల్లో చర్చ



హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వం అవకాశమిచ్చినా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో బదిలీలు చేపట్టలేదు. ఫలితంగా తమ ఆశలు అడియాసలు అవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 వరకు ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో వివిధ కారణాలతో బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. విద్యుత్ సంస్థల్లోనూ చేపట్టకపోవడంతో ఆ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బదిలీలకు ఈ నెల 31 వరకు గడువు ఇచ్చినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ సంస్థల పాలక మండళ్లను మార్చిన ప్రభుత్వం..

రాష్ట్రంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలున్నాయి. ఈ విద్యుత్ సంస్థల్లో బదిలీలు, పదోన్నతులు జరిగిన ప్రతిసారి ఆయా యాజమాన్యాలు సమిష్టి నిర్ణయం తీసుకుంటాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ సంస్థల పాలకమండళ్లను మార్చింది. ఐఏఎస్ అధికారులను సీఎండీలుగా నియమించింది. ట్రాన్స్‌కో సీఎండీగా ఉన్న సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీని బదిలీ చేసి రోనాల్డ్ రోస్‌ను ట్రాన్స్‌కో సీఎండీగా నియమించింది. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రోస్ బదిలీలపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా బదిలీలపై నిర్ణయం తీసుకోవడానికి జరుగుతున్న జాప్యానికి కారణం కావొచ్చని విద్యుత్ ఉద్యోగుల వర్గాలు చర్చించుకుంటున్నాయి.

బదిలీలపై ఎలాంటి సంకేతాలు లేవు..

బదిలీలపై ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గతంలో బదిలీలు జరిగినప్పుడు కోల్పోయిన అవకాశాలు ఈ సారైనా దక్కకపోతాయా అని భావిస్తున్న ఉద్యోగుల ఆశలు అడియాసలుగానే మిగిలిపోతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాలు, పట్టణాలకు దూరంగా పని చేస్తున్న ఉద్యోగులు జిల్లా కేంద్రాలు, నగరాలు, పట్టణాలకు రావాలని ఆశిస్తున్నారు. జూలై చివరి వారం వచ్చినా షెడ్యూల్ విడుదల కాకపోవడంతో బదిలీలు జరుగుతాయా లేదా అని, యాజమాన్యం నుంచి స్పష్టత లేకపోవడంతో తాము పాత స్థానాల్లోనే కొనసాగాల్సి వస్తుందేమోనని నిట్టూరుస్తున్నారు.

వేయికండ్లతో ఎదురుచూపులు

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలలు జరిగితే తమకు అనుకూల స్థలాలకు వెళ్లొచ్చని ఆశిస్తున్న ఉద్యోగుల ఆశలు నిరాశలవుతున్నాయి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో దాదాపు 9, 880 మంది ఉద్యోగులున్నారు. హనుమకొండ జిల్లాలో 780, వరంగల్‌లో 440, జనగామలో 425, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 405, మహబూబాబాద్‌లో 400, కరీంనగర్‌లో 1,062, జగిత్యాలలో 712, పెద్దపల్లిలో 602, ఖమ్మంలో 771, భద్రాద్రి కొత్తగూడెంలో 514, నిజామాబాద్‌లో 1,304, కామారెడ్డిలో 774, ఆదిలాబాద్‌లో 324, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 209, మంచిర్యాలలో 445, నిర్మల్‌లో 437, ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 203, డీపీఈలో 70, సీవీలో 57 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 4 సంవత్సరాలు పై బడి ఒకే చోట పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు బదిలీల కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.

నిలకడగా ఉభయ నదులు..



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి



వాజేడు: ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- స్వల్ప స్థాయిలో ప్రాణహిత, గోదావరి ప్రవాహం
- కాళేశ్వరం వద్ద 11.200 మీటర్ల ఎత్తులో వెళ్తున్న వరద

కాళేశ్వరం : మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణహిత, గోదావరి ఉభయ నదుల వరద నిలకడగా కొనసాగుతోంది. దీంతో బుధవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి పుష్కరఘాట్ గుండా 11.200 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ఆ వరద నీరు మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరి 7,87,400 క్యూసెక్కులు తరలివస్తోంది. బరాజ్‌లో మొత్తం 85 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం(సరస్వతి)బరాజ్‌కు ఎగువ నుంచి 16,500 క్యూసెక్కులు రాగా, వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువ కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

పేరూరు వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. బుధవారం ఉదయం 8 గంటల వరకు 15.45 మీటర్ల మేర తగ్గిన గోదావరి వరద.. సాయంత్రానికి 16.45 మీటర్ల మేర పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. మండలంలోని పూసూరు–ఎద్దర్లపల్లి, వాజేడు–గుమ్మడిదొడ్డి, పేరూరు–చంద్రుపట్ల, కోయవీరాపురం, రహదారులపై గోదావరి ఇంకా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని టేకులగూడెం చివరన రేగుమాకు ఒర్రె వద్ద తెలంగాణ, ఛత్తీస్ గఢ్ రహదారిపైకి చేరి ప్రవహిస్తోంది.



కన్నాయిగూడెం : సమ్మక్క సాగర్ వద్ద పెరుగుతూ ప్రవహిస్తున్న గోదావరి

సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద కూడా..

కన్నాయిగూడెం : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ సమీపంలో నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి మళ్లీ పెరుగుతోంది. రెండు రోజుల నుంచి తగ్గుతూ వచ్చిన గోదావరి బుధవారం మధ్యాహ్నం నుంచి ఎగువ ప్రాంతంలో వరదలు రావడంతో మళ్లీ పెరుగుతోంది. బ్యారేజీలోకి ఉదయం 8,85,600 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 9,75,910 క్యూసెక్కులు చేరింది. బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 84.10 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 83.30 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ములుగు రూరల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కన్నాయిగూడెంలో చోటు చేసుకుంది. రెండో ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాట సాంబయ్య (60) అదే గ్రామానికి చెందిన యాట రమేశ్, పల్లె వేణుతో కలిసి లక్నవరంలో చేపల వేటకు వెళ్లాడు. తెప్ప సాయంతో చెరువులోకి వెళ్లిన సాంబయ్య.. వలలు లాగుతుండగా కాలికి చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందాడు. కొంత సమయం తరువాత సాంబయ్య కనిపించకపోవడంతో రమేశ్, వేణు.. సాంబయ్య కోసం వెతికారు. నీటిలో మునిగిన సాంబయ్య అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చదువుకోమని తండ్రి మందలించాడని..

- బాలిక ఆత్మహత్య
- గూనిపర్తిలో ఘటన

కమలాపూర్: చదువుకోమని తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తిలో చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర హారిక (17) పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటర్మీడియట్ చదవడం ఇష్టంలేదని తండ్రికి చెప్పింది. దీంతో ఇంటి దగ్గర ఉండి ఏం చేస్తావు.. చదువుకోమని మందలించాడు. దీనికి మనస్తాపానికి గురైన హారిక మంగళవారం సాయంత్రం పురుగుల మందు సేవించింది. ఈ విషయం అదే రోజు రాత్రి తండ్రికి తెలపగా వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించారు. వైద్యులు పరీక్షించి హారిక అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

- పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విద్యాధర్
- రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న విద్యాధర్

వరంగల్ స్పోర్ట్స్ : తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచొద్దని, సహనం పాటిస్తే కచ్చితంగా సత్ఫలితాలు వస్తాయని పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు జేబీఎస్ విద్యాధర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్ -17) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరగనున్న చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ వేడుకలకు పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జేబీఎస్ విద్యాధర్, కిదాంబి నందగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతోపాటు కఠోర శ్రమ చేసినప్పుడే లక్ష్య చేధిస్తారన్నారు. మరో అతిథి నందగోపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై పీవీ సింధు, సాత్విక్‌సాయిరాజ్ సత్తాచాటుతున్నారని, వారి స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి ఎం. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే పోటీలకు 140 మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి డి. నాగకిషన్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్. మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు, టెక్నికల్ అఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్, రాజేశ్, పీసీఎస్ రావు, కిశోర్, పీవీఎల్ కుమార్, శ్యాంకుమార్, భాస్కర్, శైలజ, హరికృష్ణ, శ్యాంప్రసాద్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన ఉండాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2024–2025) పై ఆ కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్నిరంగాలను అభివృద్ధి పరిచే విధంగా బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఎక్కువ కేటాయించాలన్నారు. కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. చర్చ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరాశ పరిచిందన్నారు. పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ తిరుణహరిశేషు మాట్లాడుతూ కేంద్రవార్షిక బడ్జెట్‌లో ఆదాయం కంటే అప్పులే ఎక్కువగా కేటాయించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్. ఆదిరెడ్డి, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వం

- ద్రవిడ కళగం నేత కుమరేసన్



మాట్లాడుతున్న ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్

హన్మకొండ: వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వమని ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్ అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు జె.రవి, ఉప్పులేటి నరేశ్ అధ్యక్షతన భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ జరిగింది. ఈ సభలో కుమరేసన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత దేశంలో సామాజిక విప్లవాలు, రాజ్యాంగ సవరణలకు కారణమైన పెరియార్ ఉద్యమ భావజాలాన్ని 1970 నుంచి ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయడంలో నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు జయగోపాల్ తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వి.సి.కె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీం, రచయిత గురిజాల రవీందర్, భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు సాయిని నరేందర్, జె. రవి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి దేశంలో మనుధర్మ పాలన తీసుకొచ్చే ప్రమాదముందన్నారు. ప్రగతిశీల శక్తులు, నాస్తికులు, హేతువాదులు మానవీయ విలువల సమాజ నిర్మాణం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. సభలో వి.సి.కె పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మచ్చ దేవేందర్, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, భారత నాస్తిక సమాజం నాయకులు జ్యోతికుమార్, చార్వాక, శ్యామల, రామంచ భరత్, గుమ్మడిరాజుల సాంబయ్య, పెండ్యాల సుమన్, వేదాంత మౌర్య, సంతోశ్, స్వప్న, అశోక్, గుత్తికొండ చక్రధర్, రాధండి దేవేందర్, పల్లె ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాస్

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలని హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ–1 డిపోలో వరంగల్ రీజియన్ ప్రమాదరహిత వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. డీటీసీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. సరైన విశ్రాంతి తర్వాతే డ్యూటీకి హాజరు కావాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి చిరునామా ఆర్టీసీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సేఫ్టీ అవార్డులు ప్రతి సంవత్సరం అందుకుంటుందన్నారు. డ్రైవర్లలో క్రమశిక్షణ, అప్రమత్తత పెంచడానికి ప్రతి సంవత్సరం జనవరిలో రోడ్డు భద్రత పక్షోత్సవాలు, జూలైలో ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనాలు నడపాలన్నారు. ప్రయాణికుల జీవితం బస్సు డ్రైవర్ చేతిలో ఉందని, తన బాధ్యతను గుర్తెరిగి బస్సు నడపాలన్నారు. కార్యక్రమంలో వరంగల్–1 డిపో మేనేజర్ వంగాల మోహన్ రావు, సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో సంకటచతుర్థి పూజలు



మూలగణపతికి హరిద్రాకుంకుమలతో అభిషేకం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ఆషాఢ బహుళ చతుర్థి తిథిని పురస్కరించుకుని బుధవారం సంకటహరచతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠ, అర్చకులు ప్రణవ్ మూలమహాగణపతికి గణపతిసూక్త మూలమంత్రములతో హరిద్రాకుంకుమ, గంధోదకాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నీరాజనమంత్రపుష్పం, నైవేద్యం సమర్పించి మహాహారతి నిర్వహించారు.

'శతాధిక' వృద్ధురాలి మృతి



ఈరవ్వ(ఫైల్)

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన 'శతాధిక' వృద్ధురాలు బరిగెల ఈరవ్వ(118) మృతి చెందింది. బుధవారం ఉదయం స్నానం చేసి పాలు తాగుతూ అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతి చెందింది. కాగా, ఈరమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తెతో పాటు మనువలు, మనువరాళ్లు దాదాపు 30 మందికి పైగా ఉన్నారు.

ఆస్పత్రి గడప తొక్కని ఈరమ్మ..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పాతికేళ్లు దాటితే చక్కెర వ్యాధి, రక్తపోటు అంటూ ఆస్పత్రుల చుట్టుతిరుగుతూ జీవనం గడుపుతున్న తరుణంలో శతాధిక వృద్ధురాలు ఈరమ్మ సూదిమందు కూడా లేకుండా జీవించింది. మంగళవారం వరకు తనపని తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉంది. కాగా, 118 ఏళ్లలో ఏనాడు ఆస్పత్రి గడప తొక్కలేదని, కనీసం సూదిమందు అంటే కూడా తెలియదని కుటుంబీకులు తెలిపారు.

కాంగ్రెసోళ్లవి తుపాకీరాముని మాటలు

- పథకాల పేరిట ప్రజల చెవుల్లో పూలు పెట్టారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా కుట్టు మిషన్ల పంపిణీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడుగుతుంటే .. కాంగ్రెస్ నాయకులు తుపాకీ రాముని మాటలు మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం జనగామ మండలం యశ్వంతాపూర్ సత్యసాయి కన్వెన్షన్‌లో పోచంపల్లి ఫౌండేషన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాలఘణపురం మండలంలోని వెయ్యి మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్ కృషి చేశారన్నారు. గృహలక్ష్మి, రైతుబంధు, రుణమాఫీ, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల చెవుల్లో పూలు పెట్టారన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే కేటీఆర్ బర్త్‌డే రోజు కుట్టు మిషన్లు అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో పది వేల మందికి శిక్షణ ఇప్పించానన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ జయశ్రీ, భాగ్యలక్ష్మి, తిర్మల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి,రాజు పాల్గొన్నారు.

మోడల్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంగా ఎల్కతుర్తి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్కతుర్తి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎంలు, జీఎంల సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొడవాటి లైన్లలో సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని పరిష్కరించడానికి ఆ లైన్ మొత్తం పెట్రోలింగ్ చేసుకుంటూ వెళ్లడం వల్ల ఆలస్యం అవుతోందన్నారు. అయితే ఈ సమస్యను అధిగమించడానికి ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్లు అమర్చుతున్నట్లు తెలిపారు. వీటి ద్వారా సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించొచ్చన్నారు. ములుగు, నర్సంపేటలో ప్రతి 4 కిలో మీటర్లకు ఫాల్ట్‌ప్యాసేజీ ఇండికేటర్ అమర్చుతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకొస్తున్నామని, ఈ టెక్నాలజీతో సబ్‌స్టేషన్లలో లోడ్, పవర్ ఫాక్టర్, ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్లు, ఎల్‌సీ తదితర పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. సమస్యను సులభంగా గుర్తించి అదే వేగంతో పరిష్కరించొచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్, డీఈ (ఐటీ) అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

HNK భీమారం మెయిన్ రోడ్ GMR గార్డెన్ ప్రక్కన సెల్లార్+ గ్రౌండ్ + 1st మరియు 2nd ఫ్లోర్స్ గల బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును. కాలేజీలకు, హ్యాస్పిటల్స్‌కు అనుకూలంగా ఉండును. సంప్ర॥ 9849141411, 9849820345. [W-1239817]

SERVICES

అతి తక్కువ వడ్డీతో ఇల్లు వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. సంప్ర॥ 8897402935. [W-1242432]

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా, ధరఖాస్తు హన్మకొండ. సెల్: 8096520976. [WA-6511]

FINANCE SERVICES

సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్: 9666142226. [W-1239808]

FINANCIAL SERVICES

బాలాజీ లోన్స్ : బిజినెస్, ప్రాపర్టీ, ఓపెన్ ప్లాట్స్, మార్టిగేజ్, టేకోవర్ లోన్స్. తక్కువ వడ్డీకి లోన్ ఇప్పించబడును. I.T. రిటన్స్, G.S.T, పాన్ కార్డ్ చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. 85228 25358. [M-1185269]

FINANCE

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239807]

OLD AGE HOME

త్రినేత్రహోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను, వంట / ఇంటిపని 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 7396857799,7396753377 [H-796261]

WANTED

హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ కావలెను. 8 గం॥12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 10000–16000, సెల్ నెం: 9440414616. [W-1239816]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185364]

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని, వంట పనిక వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.